క్లుప్తంగా

తల్లిపాలు బిడ్డలకు శ్రీరామరక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎంఓ ప్రదీప్

కారంచేడు: తల్లిపాలు తమ బిడ్డల ఆరోగ్యానికి శ్రీరామ రక్షగా ఉంటుందని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం శాలినీ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశాలు మీ పరిధిలోని గర్భిణులకు తప్పకుండా ఈ విషయాలను తెలిపాలన్నారు. 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు పాలతో పాటు బలమైన ఆహారం కూడా అందించాలన్నారు. లెప్రసీపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఎంఓ ప్రదీప్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసి ఫోరా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

8న దినసరి వేతన సిబ్బంది జిల్లా సమావేశం

మార్టూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో దినసరి వేతనంతో పనిచేయుస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం మార్టూరులో ఈనెల 8వ తేదీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మార్టూరుకు చెందిన బిల్ కలెక్టర్ షేక్ తాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న సమావేశానికి స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు, బిల్ కలెక్టర్లు, టర్న్‌కాక్‌లు పెద్ద ఎత్తున హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని తాజ్ కోరారు. సమావేశంలో యూనియన్ ఏర్పాటు చేసుకొని సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు తాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పైసలు ఇవ్వు.. పత్రం పట్టు !

- జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఆర్ఐ రూటు సపరేటు
- ఆలస్య నమోదు, విచారణలకు నోట్లు ఇచ్చుకోవాల్సిందే
- చీరాల రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగుల పనితీరు సమస్యాత్మకం



చీరాల మండల తహశీల్దార్ కార్యాలయం

చీరాల టౌన్: యథారాజా తథా అధికారులు.. అన్న చందంగా తయారైంది ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉన్న అధికారుల పరిస్థితి. ఈ ఆరు నెలల్లో కూటమి నాయకులు అందినకాడికి దోచుకున్నారు. దీనికి మేం కూడా ఏం మాత్రం తీసిపోం అన్నట్లుగా అధికారులు ఉన్నారని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గతంలో వలంటీర్లు ఏ ధ్రువ పత్రం కావాలన్నా ఇంటికి వచ్చి మరీ ఇచ్చేవారు. కాని కూటమి ప్రభుత్వంలో మాత్రం ప్రజలు మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందుల పాలవుతున్నారు. 'ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఆలస్యం చేయవద్దు.. వీఆర్వోలు ప్రజలను సర్టిఫికెట్ల విషయంలో ఇబ్బందులకు గురిచేయకండి. ఎవరి వద్ద నుంచి కూడా ఎలాంటి వసూళ్లు చేయకూడదని' నిత్యం మండల రెవెన్యూ అధికారి సూచించే మాటలు, ఆదేశాలు. కానీ చీరాల రెవెన్యూ కార్యాలయంలో జరుగుతుంది మాత్రం పూర్తిగా విరుద్ధం. కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది మాత్రం తమకు నచ్చిన వారికి త్వరగా అన్నీ పనులు చేస్తూ అటు స్వామి కార్యం ఇటు ఆర్థిక కార్యంతో చక్కగా పనులు చేసుకుంటున్నారు. నిత్యం వివిధ రకాల వందలాది అర్జీలు వచ్చే చీరాల మండల తహశీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ అధికారి మాత్రం తనకు రొక్కం చెల్లిస్తేనే ధ్రువీకరణ పత్రాలకు ఆమోదం తెలుపుతున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా విచారణ చేయాలి, నేనే అర్జీదారుని వద్దకు వస్తా. ఓకే అని ధ్రువీకరణ చేస్తేనే ముఖ్య అధికారి వద్దకు ఫైలును పంపుతాను అంటూ ఆర్ఐ వ్యవహరిస్తున్న తీరుతో ఇబ్బందులు పడుతున్నామని వీఆర్వోలు నెత్తి నోరు బాదుకుంటున్నారు.

ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం..

చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలోని 33 వార్డులకు చెందిన ప్రజలకు ఏ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలన్నా మండల రెవెన్యూ కార్యాలయానికి అర్జీలు దాఖలు చేస్తుంటారు. అంతా ఆన్‌లైన్‌లోనే, కాగిత రహిత పాలన చేస్తున్నామని పాలకులు చెప్తున్నప్పటికీ ఆన్‌లైన్ అయినా, సాధారణ పద్ధతి అయినా సర్టిఫికెట్ల పత్రాలు మంజూరు చేయాలంటే తహశీల్దార్ సంతకం తప్పనిసరి. ఈ–సేవా కేంద్రాల నుంచి ప్రతి రోజు ఆదాయం, కుల ధ్రువీకరణ, లేట్ ఎంట్రీ (జనన, మరణ) ధ్రువీకరణ పత్రాలు, అడంగళ్, 1–బీ, రేషన్ కార్డులు, ఓటర్ కార్డుల కోసం దరఖాస్తులు అందిస్తుంటారు. వీటన్నింటిని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న వీఆర్వోలు విచారించి, ఆర్ఐ విచారణ తర్వాత సంతకాల అనంతరం ధ్రువీకరణ పత్రం మంజూరుకు తహశీల్దార్‌కు అందిస్తారు. అనంతరం తహసీల్దార్ డిజిటల్ సంతకంతో ఆమోదించగా ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తారు. ఇదీ జరగాల్సిన ప్రక్రియ. కానీ వాస్తవానికి జరుగుతోంది వేరు.

టీడీపీ నాయకులు కోరి తెచ్చుకున్నారు..

పొలాలకు సంబంధించిన వాటికి అయితే కట్టలుగా నగదు చెల్లిస్తే ఏళ్ల తరబడి వివాదాల్లో ఉన్న భూములకు ఉన్న సమస్యలను పరిష్కరించేలా తనదైన శైలిలో పనిచేస్తున్నాడు ఆర్ఐ. గతంలో ఇక్కడ కార్యాలయంలో పనిచేసిన సమయంలో ఉన్న పరిచయాలతో, ఇప్పుడు పదోన్నతి వచ్చిన ఆయన కలెక్షన్లు చేస్తున్నాడు. ఆ అధికారి సీట్లో కూర్చొగానే కొందరు పైరవీదారులు ఆయన చుట్టూ చేరి నోట్లు వచ్చే పనులను త్వరగా పూర్తిచేసేలా ప్రోత్సహిస్తుంటారు. ఇటీవల చీరాల రూరల్ గ్రామాలకు చెందిన కొందరు తమకు జనన ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో లేట్ ఎంట్రీ (ఆలస్య నమోదు)కు అన్నీ ధ్రువీకరణాలతో ఈ–సేవా ద్వారా తహశీల్దార్ కార్యాలయానికి అర్జీలు అందించారు. ఆ గ్రామాల వీఆర్వోలు గ్రామంలో విచారించి వారికి ఉన్న వివిధ రకాల సర్టిఫికేట్లను కూడా విచారించి సర్టిఫికెట్ అందించేందుకు సంతకాలు చేశారు. అయితే రెవెన్యూ అధికారి మాత్రం లేట్ ఎంట్రీ సర్టిఫికేట్ ఇవ్వాలంటే రొక్కం ఇవ్వాలి. ప్రొటోకాల్ ఖర్చులు అధికంగా ఉన్నాయి. మీకు తెలియదా.? లేట్ బర్త్, లేట్ డెత్ సర్టిఫికేట్లు ఇవ్వాలంటే నగదు వసూలు చేసి ఇవ్వండి లేకుంటే మీ ఇష్టం అని హుకుం జారీ చేశాడు. దీంతో ఆయా గ్రామాల వీఆర్వోలు అధికారి తీరుతో విస్తుపోతున్నారు. తాము విచారణ చేసి అర్హులుగా తేల్చినా అర్జీదారుల నుంచి నగదు వసూళ్లు చేసి అధికారికి ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తనకు రొక్కం ఇవ్వని అర్జీలను అధికారి పక్కన పడేస్తున్నాడని అభ్యర్థులు వాపోతున్నారు. అలానే గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న కొలతల సిబ్బంది కూడా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తూ భూమి కొలతలు, సర్వే కోసం, ప్లాట్ల కేటాయింపులకు అర్జీలు ఇచ్చిన వారి నుంచి నగదు వసూళ్లు చేస్తున్నాడని అర్జీదారులు చెప్తున్నారు. అంతేగాక కార్యాలయంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు అన్నీ పనుల్లో చక్రం తిప్పుతున్నారు. ఈ అక్రమాల అధికారిని మరో ప్రాంతం నుంచి ఇక్కడికి టీడీపీ నాయకులు కోరి మరీ తెప్పించుకుని వారికి కావాల్సిన పనులను చేయించుకుంటున్నారు. దోపిడే ధ్యేయంగా పనిచేస్తున్న ఆ రెవెన్యూ అధికారికి టీడీపీ నాయకుల అండదండలు ఉండటంతో మరింత రెచ్చిపోతున్నాడు.

> **పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం..**
>
> రెవెన్యూ కార్యాలయం పరిధిలోని మున్సిపాలిటీ, 15 గ్రామ పంచాయతీల్లోని ప్రజలు తమకు ఉన్న సమస్యలను నేరుగా వచ్చి కలిసి పరిష్కరించుకోండి. ఏ పనికి, ఎవరికీ నగదు ఇవ్వాల్సిన అవసరం లేదు. కార్యాలయంలో పనిచేస్తున్న దిగువ శ్రేణి ఉద్యోగులు, గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు పనితీరుపై నిఘా ఉంచాం. కొందరు అర్జీదారుల నుంచి వసూళ్లు చేస్తున్నారనే సమాచారం కూడా ఉంది. అలాంటి అధికారుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా అందిస్తాం. వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.
>
> – కుర్రా గోపీకృష్ణ, తహశీల్దార్, చీరాల

పంగులూరులో కోతుల బీభత్సం

జే.పంగులూరు: మండల కేంద్రం పంగులూరులో మంగళవారం కోతులు బీభత్సం సృష్టించాయి. బజార్లలో విచ్చలవిడిగా తిరుగుతూ 10 మందిని గాయపరిచాయి. వారిలో పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ, మహిళా సంఘం జిల్లా నాయకులు రాలు రాయిణి కృష్ణకుమారి ఉన్నారు. ఉదయం గ్రామంలోకి ప్రవేశించి కోతులు గుంపులుగా ఇళ్లల్లోకి చేరాయి. వాటిని బయటకు పంపేందుకు ప్రయత్నించిన వారిపై దాడిచేసి గాయపరిచాయని పలువురు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు వీటిని బయటకు పంపేందుకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ


బహుమతులు అందిస్తున్న అతిథులు

చీరాల అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం భావనారుషి పేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు వారి వారి అవసరాలను బట్టి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆటలలో ప్రతిభ కనబరచిన పిల్లలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వీఆర్ఎస్‌వైఆర్ఎన్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ పి.రవికుమార్, స్కూల్ హెచ్ఎం హేమంత్‌కుమార్, ఫిజియోథెరపిస్ట్ చైతన్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

పొలంలో నిల్వఉన్న నీటిని తీసేయాలి


రైతులకు సూచనలు చేస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల: వర్షాలు కురుస్తున్నందున పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తీసేయాలని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రావినూతల, కుర్రవానిపాలెం గ్రామాల్లో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనగ, పొగాకు పొలాల్లో అక్కడక్కడ నీరు నిలుస్తుందని, నీటి నిల్వలు లేకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషక లోపాలకు 19.19.19 కాని 13.0.45 ఎరువులను కాని వేసుకోవాలన్నారు. అలాగే పొటాష్, యూరియాను పొలంలో వేసుకోవడం వలన తేమశాతాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈనెల 15లోగా పంట నమోదు, పంటల బీమాను చేసుకోవాలని సూచించారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసకోవాలని వ్యవసాయాధికారి కోరారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం, పూర్వాషాడ నక్షత్రం, తదియ తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


మార్టూరులో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఈవో


జే.పంగులూరులో బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు


వేటపాలెంలో మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్బయ్య

- ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం
- దివ్యాంగులకు ఆటల పోటీలు

వైకల్యం శరీరానికే..

మనసుకు కాదు

చినగంజాం/పర్చూరు/మార్టూరు/కారంచేడు/యద్దనపూడి: అంగవైకల్యాన్ని ఏ ఒక్కరూ శాపంగా పరిగణించరాదని.. వైకల్యం ఉన్నా ఎన్నో అద్భుతాలు సృష్టించి చరిత్రలో నిలిచిన దివ్యాంగులను స్ఫూర్తిగా తీసుకొని విజయం సాధించాలని మార్టూరు ఎంఈవో వస్రామ్ నాయక్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మార్టూరు రామ్ జనార్దన్ కాలనీలోని భవిత సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం నేడు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని అందిపుచ్చుకొని విద్య, ఉద్యోగాల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రమీల, ఐఈఆర్‌సీలు నాగకుమారి, ఆయేషా, పర్వీన్ పాల్గొన్నారు.

■ విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులను సైతం నిత్య విద్యార్థిలానే చూడాలని చినగంజాం ఎంఈఓ–2 ఎస్ కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం చినగంజాం మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవిందస్వామి, ముసలయ్య ఆధ్వర్యంలో పిల్లలకు బిస్కట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్, హెచ్ఎం డీ రత్నకుమారి, ఎస్ నరసింహారావు, హెచ్ఎం రసూలున్నిసా బేగం సిబ్బంది పాల్గొన్నారు.

■ పర్చూరులో విభిన్న ప్రతిభా వంతులను రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్ ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని రాములోరి గుడి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వారిని శాలువాతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు కొత్తూరి లక్ష్మి, సుభాషిణి, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, షేక్ నాగూరువలి తదితరులు పాల్గొన్నారు.

■ విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని పర్చూరు ఎంపీడీఓ ఎల్ ప్రద్యుమ్నకుమార్ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని పర్చూరు భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు.

■ యద్దనపూడి జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం ఎమ్. దేవేంద్ర ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శివపార్వతి, తేళ్ల సుబ్బారావు, రజని, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

■ విభిన్న ప్రతిభావంతుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు శిక్షకులు కృషి చేయాలని ఇంకొల్లు ఎంఈఓ ఏ శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం సందర్భంగా ఇంకొల్లు భవిత కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఉర్దూ పాఠశాల హెచ్ఎం జే రవిబాబు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. భవనం బ్రహ్మారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు భవనం రామిరెడ్డి, ఆదిపూడి గ్రామస్తులు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీ నాగమణి, వలేరు వీరయ్య, ఫిజియోథెరపిస్ట్ ఎంపీపీ పూజిత సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో దివ్యాంగులకు మేలు..

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ/జే.పంగులూరు: భవిత కేంద్రం దివ్యాంగ పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని కొరిశపాడు ఎంఈవో వీరరాఘవయ్య అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మేదరమెట్లలోని ఎంపీపీఎస్ వైసీ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీ.అంజయ్య, అజయ్‌కుమార్, పద్మావతి, రాధశిరీష, కొండయ్య, రవిశేఖర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

■ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతోపాటు దాతల చేయూత అవసరమని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి, మండల న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దానిలో భాగంగా చైతన్య బధిరుల పాఠశాలలో, 76 శాతం వినికిడి లోపం ఉన్న దివ్యాంగ విద్యార్థిని ఉప్పలపాటి పద్మకు రోటరీ సౌజన్యంతో రూ.7 వేల విలువైన హియరింగ్ పరికరం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, న్యాయవాదులు ప్రకాష్, మార్త శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఆరోగ్యం, తదితరులు పాల్గొన్నారు.

■ నేడు సాధారణ బాలలకు తీసిపోకుండా దివ్యాంగ పిల్లలు అన్ని రంగాల్లోనూ ముందజంలో ఉన్నారని అద్దంకి మండల ఎంఈఓ బీ సుధాకర్‌రావు అన్నారు. స్థానిక అద్దంకి భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వేదవతి, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, కొండమ్మ, మస్తాన్ వలి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

వేటపాలెం: దివ్యాంగ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈఓ సుబ్బయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో గల భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శివప్రసాద్, ఐఈఆర్‌పీ ధనలక్ష్మి, శ్రీధర్ పాల్గొన్నారు.

జే.పంగులూరు/బల్లికురవ: విభిన్న ప్రతిభావంతులు తప్పనిసరిగా విద్యపై ఆసక్తి పెంచుకొని, విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంఈఓ వీరాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని స్థానిక పంగులూరు భవితా కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పి యోహాన్, అరుణ, ఉపాధ్యాయులు స్వర్ణదుర్గ వెంకటవర ప్రసాద్, బ్యాంకు అసిస్టెంట్ జోసఫ్, ఉపాధ్యాయురాలు లతిత కుమారి పాల్గొన్నారు.

■ దివ్యాంగులను ప్రోత్సహిస్తే రాణిస్తారని కొణిదెన ఉన్నత పాఠశాల హెచ్ఎం కెబీ. వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బల్లికురవలోని భవిత కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కె. గోపి, కెజీబీవిలో అధ్యాపకురాలు రాజకుమారి, అద్దంకి ఫౌండేషన్ చైర్మన్ ఖాశింవలిని దుశ్శాలువాతో సత్కరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కారంచేడు: నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల యువతీ, యువకులు సరైన అవగాహనతో పాటు, అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని ఎస్ఐ వీ వెంకట్రావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. పోలీస్ యంత్రాంగం ఎన్ని రకాలుగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త మార్గాల్లో ఈ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మనకు తెలియని నంబర్లు, వ్యక్తుల ద్వారా ఎట్టి పరిస్థితుల్లోను ఉత్తర ప్రత్యుత్తరాలు చేయకూడదన్నారు. అలాగే యువత ప్రమాదాలకు గురవ్వకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించారని కేసు

మార్టూరు: తమ పూర్వీకులకు చెందిన నివాస భవనాలను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నారనే విషయమై మార్టూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సీఐ ఎం శేషగిరిరావు వివరాల మేరకు.. గుంటూరు ఎస్వీఎన్ కాలనీలో నివాసం ఉంటున్న కల్లూరి అనిల్‌బాబు తన పూర్వీకులు మార్టూరు గ్రామ సర్వేనంబర్ 603/ఏలో ఒక ఎకరా భూమిని కొనుగోలు చేసి అందులో ఎనిమిది భవనాలను నిర్మించారు. రావిపూడి వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని వాచ్‌మెన్‌గా ఉంచి ఆ భవనాల అద్దెలు వసూలు చేస్తూ ఉండేవారు. ఈ క్రమంలో రావిపూడి వెంకటేశ్వర్లు అతని కుమారుడు రావిపూడి సతీష్‌లు కలసి సదరు భవనాలకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తయారు చేయించి ఆక్రమించుకున్నారని కల్లూరి అనిల్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రింటర్, జిరాక్స్ మెషిన్ బహూకరణ


పాఠశాలకు మెటీరియల్ అందజేస్తున్న దాతలు

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని ప్రాథమిక పాఠశాలకు బోర్డు స్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు రూ.1.50 లక్షల విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, జిరాక్స్ మిషన్, బీరువాలను అందించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని పాఠశాల హెచ్ఎం కేడీవీ ప్రసాద్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, ఉపాధ్యాయులు బొజ్జా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణే ఉపాధి లక్ష్యం

యద్దనపూడి: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించటంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టటమే మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం లక్ష్యమని పీడీ ఏవీ విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రం యద్దనపూడి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం 1 ఏప్రిల్ 2023 నుంచి 31 ఏప్రిల్ 2024 వరకు చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ ప్రజావేదికలో గత ఏడాది మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన రూ.7.74 కోట్ల పనులకు చెందిన ఆడిట్ నివేదికలను సమర్పించారు. ఎస్ఆర్పీ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఐదుగురు డీఆర్పీలతో వారంరోజుల పాటు ఆయా గ్రామాల్లో గ్రామసభల అనంతరం ఆయా గ్రామాల్లో సేకరించిన సమాచారాన్ని సోషల్ ఆడిట్‌లో చదివి వినిపించారు. కార్యక్రమంలో పీడీ పీడీ విజయలక్ష్మి, డిస్టిక్ విజిలెన్స్ ఆఫీసర్ శోభన్‌బాబు, ఏపీడీ కోటయ్యానాయక్, ఎస్ఆర్పీ వెంకటేష్‌నాయక్, ఎంపీడీఓ మహ్మద్ ఆబీద్ జావెద్, ఏపీఓ రమేష్, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక నిర్వహిస్తున్న తనిఖీ బృందం

తుఫాన్ దెబ్బకు నేలకొరిగిన వరి

- పంట చేతికందే తరుణంలో దెబ్బతీసిన ఫెంగోల్ తుఫాన్

బల్లికురవ: తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులు, ఈదురుగాలులకు మండలంలో ఆహార ధాన్యమైన వరిపంట నేలకు వాలింది. మండలంలోని కూకట్లపల్లి, వైదన, కొప్పరపాడు, కొమ్మినేనివారిపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి గ్రామాల్లో సాగర్ ఆయకట్టు బోర్ల కింద వరిసాగు చేపట్టారు. ప్రస్తుతం వరి కోతదశలో ఉంది. తుఫాన్ హెచ్చరికలు, ఈదురు గాలులతో ఆరుగాలం కష్టించి పండించిన పంట వర్షార్పణం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారిణి ఎస్‌వీపి కుమారి మాట్లాడుతూ వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపాలన్నారు. నేలవాలిన దుబ్బులను పైకి లేపి నాలుగు, లేదా ఐదు దుబ్బులు కలిపి కట్టలు కట్టుకోవాలని రైతులకు సూచించారు.


గుంటుపల్లిలో నేలకు వాలిన వరిపైరు


కూకట్లపల్లిలో నేలకు వాలిన వరి

మద్యం బాటిళ్లు స్వాధీనం

చీరాల: అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని మంగళవారం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ బి.శ్రీహరి, సిబ్బంది మంగళవారం చీరాల మండలం వాడరేవు బస్టాండ్ దగ్గర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వాడరేవుకు చెందిన ఐల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అక్రమంగా మద్యం కలిగి ఉండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 10 బ్రాందీ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.